# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

JULY - 2002

# సంక్షిప్త వార్తలు

తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం మండలం రాపర్తి గ్రామములో 2002 జూన్ 4వ తేదీ సాయంత్రం సువార్త కూటము జరిగెను. సోదరులు జాషువా గూటం గారు, సోదరులు చుక్కా దేవానందం (చిన జగ్గంపేట) గారు వాక్యపరిచర్య చేసిరి. ఆ గ్రామములో బేసిక్ బైబిలు కోర్సు పూర్తి చేసిన 53 మందికి సర్టిఫికెట్లు, బైబిళ్లు జాషువా గారు అందజేసిరి. తదనంతరం ఒకాయన క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. రాపర్తి, గొల్లప్రోలు, దుర్గాడ గ్రామములలో సోదరులు బండి మోషే గారు సువార్త చాటుచున్నారు.

జూన్ 10వ తేదీనాడు కరప గ్రామములో "జన్మభూమి" కార్యక్రమం ముగింపు సందర్భముగా కాకినాడ సత్యవాణి క్రీస్తుసంఘము తరపున 100 చీరలు విధవరాండ్రకు సోదరి కబితా గూటం గారి ద్వారా పంచిపెట్టబడెను. నాటి కార్యక్రమునకు మంత్రి చిక్కాల రామచంద్రరావు గారు, ఆర్.డి.ఓ గార్లు హాజరై క్రీస్తు సంఘముల పరిచర్య నభినందించిరి.

జూన్ 9,10వ తేదీలలో కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో అక్కడ స్థానిక సంఘము సువార్త కూటముల నేర్పాటుచేసిరి. ఆ కూటములలో సోదరులు జి.షడ్రక్ (పాలకొల్లు), బుర్రేయోహాను (కురెళ్లగూడెం), జె. డేవిడ్‌రాజు (విజయవాడ), ఓర్సు ప్రసాదరావు (చంద్రాల), కె. గాబ్రియేలు (విజయవాడ), జె. మురళి (జక్కంపూడి) గార్లు వాక్యపరిచర్య చేసిరి. తదుపరి 11వ తేదీ మంగళవారం కృష్ణా, ఖమ్మం, పశ్చిమ గోదావరి జిల్లాల సువార్తికుల సదస్సు అదే ఆవరణలో ఘనముగా జరిగెను. ఆనాడు "నేడు పరిశుద్ధాత్ముడు ఎట్లు పనిచేయుచున్నాడు?" అను అంశము సవిస్తరముగా చర్చించబడెను.

నాటి సదస్సుకు సోదరులు కె. ఇశ్రాయేలు (కంభంపాడు) గారు అధ్యక్షత వహించి కార్యక్రమము నంతటినీ ఘనంగా నడిపించిరి. ఆయన ప్రార్థనతోనే సదస్సు ఆరంభమాయెను. తదుపరి సోదరులు జి. మార్కు (నందిగామ), జి. షడ్రక్ (పాలకొల్లు), ఐ. ఇశ్రాయేలు (తిరువూరు), జాషువా గూటం (కాకినాడ) గార్లు పై అంశముపై చర్చించిరి. సోదరులు పి. షడ్రక్ గారు వందన సమర్పణచేయగా జె. కొర్నేలియస్ (వుయ్యూరు) గారి ప్రార్థనతో సదస్సు ముగిసెను. పి. షడ్రక్ గారు గొప్ప వ్యయప్రయాసలకోర్చి వచ్చినవారందరికీ మంచి భోజన వసతులనేర్పాటు చేసిరి. సువార్త పరిచర్య చేసిన వారందరినీ పూలమాలలతో సత్కరించిరి.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 363722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 22 జూలై 2002 సంచిక 12


## క్రీస్తునందు దేవుని ప్రత్యక్షత

### (Manifestation of God in Christ)

"పూర్వకాలమందు నానా సమయములలోను నానా విధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకు వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను. ఆయన దేవుని మహిమయొక్క తేజస్సును, ఆయన తత్వము యొక్క మూర్తిమంతమునై యుండి తన మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించుచున్నాడు" అని హెబ్రీ 1:1-4లో అపో.పౌలు వ్రాసెను.

# సృష్టిలో దేవుని బయల్పాటు

దేవుని గూర్చిన అనేక ఋజువులు ఈ లోకమందంతటా మనకు కనబడుచున్నవి. ప్రకృతిలో యున్న ఋజువులను బట్టి దేవుడు తనను గూర్చి సాక్ష్యము లేకుండ చేయలేదు (అపొ.కా. 14:17). పగటికి పగలు బోధ చేయుచున్నది. రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నది. వాటికి భాష లేదు, మాటలు లేవు, వాటి స్వరము వినబడదు... లోక దిగంతముల వరకు వాటి ప్రకటనలు బయలు వెళ్ళుచున్నవి యని దావీదు మహారాజు వ్రాసెను (కీర్త 19:2-4). ప్రకృతి ద్వారా దేవుని యొక్క నిత్య శక్తియు, దేవత్వమును బయలు పరచబడుచున్నవి (రోమా 1:20). నిజానికి దేవుడు మనందరికి ఎంత దగ్గిరగా యున్నాడంటే ఆయనయందే మనము బ్రతుకుచున్నాము, చలించుచున్నాము, ఉనికిని కలిగి యున్నాము (అపొ.కా. 17:28).

అయితే ఈ విశ్వమందు మనకు కనబడు సృష్టియంతటిలోను మానవుడు తన పాపముల నుండి విమోచింపబడుటయెట్లో తెలిసికొనుటకు సరిపడినంత సమాచారము లభించుటలేదు. అయితే మనలో ఎవని నుండి దేవుడు దూరముగ లేడు గనుక ఆయనను వెదకి కనుగొను నిమిత్తము మానవునికి సరిపడినంత ఆధారము ఈ ప్రకృతిలో లభించుచున్నది (అపొ.కా. 17:27).

"అయినను మృగములను విచారించుము, అవి నీకు బోధించును. ఆకాశపక్షులను విచారించుము, అవి నీకు తెలియజేయును....సముద్రములోని చేపలును నీకు దానిని వివరించును" అని యోబు గ్రంథము 12:7,8లో వ్రాయబడి యున్నది.

ప్రకృతిలోను, జంతువులలోను దేవుని యొక్క ఉనికి మనకు ఖచ్చితముగా కనబడుచున్నను, యేసుక్రీస్తునందు దేవుని మహిమ యొక్క తేజస్సును, ఆయన తత్వము యొక్క మూర్తిత్వము మరింత ఖచ్చితముగా

ప్రత్యక్షపరచబడినది. "ఏలయనగా దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది" యని కొలస్స 2:9లో వ్రాయబడి యున్నది. అందువలన క్రైస్తవులు జ్ఞానమునకు మించిన దేవుని సంపూర్ణతను ఇప్పుడు ఎరిగినవారై యున్నారు.

ఎవడును ఎన్నడును దేవుని స్వరూపము చూడలేదు (యోహాను 5:37). గనుక కనబడని దేవునియందు మేము విశ్వాసముంచలేము అని కొందరు చెప్పుచుందురు. అయితే ఈలోకములో యున్న ప్రాముఖ్యమైన అత్యవసరమైన గొప్ప సంగతులను మనలో ఎవడు చూచి యుండలేదుకూడ. గాలిని చూచిన వాడెవడు? నీవుగాని నేను గాని దానిని యెన్నడు చూచి యుండలేదు. అయితే చెట్లు తమ తలలు వంచునప్పుడు గాలి వీచుచున్నదని మన మెరుగుదుము.

అట్లే శబ్దము, తలంపులు, ప్రేమ, విశ్వాసము, నిరీక్షణ, ఓర్పు, సాత్వీకము మొదలైన వాటిని చూచిన వాడెవడు? అయితే అవి మన జీవితములో అత్యవసరమైన కొన్ని సంగతులు. అవి ఆత్మ యిచ్చు ఫలములు (గలతీ 5:22).

ప్రస్తుతము మన శరీరము మనకు చాల ప్రాముఖ్యముగ కనబడుచున్నది. అయితే మన శరీరములను సజీవయాగముగా మనము దేవుని కర్పించవలసి యున్నది (రోమా 12:1). శరీరములో మనము దేవుని మహిమపరచవలసి యున్నది. అయినను మన బాహ్య పురుషుడు కృశించిపోవును, శిథిలమై పోవును, మార్పుజెందును. అయితే అంతరంగిక పురుషుడగు మన ఆత్మ మన కంటికి కనబడకపోయినను దినదినము నూతన పరచబడుచున్నాడు. ఈ యాత్మ నిత్యము జీవించునది (2 కొరింథీ 4:16, 5:1).

## క్రీస్తు శరీరధారియైన దేవుడు

అట్లే దేవుని గూర్చి మన మెరుగవలసినది ఆయన స్వరూపము, ఆకారము

కాదు. అట్లయిన ఆయన వాటిని మనకు ప్రత్యక్షపరచి యుండును. గాని దేవుడు తన్నుతానే మన కొరకు బయలుపరచుకొనెను. "దేవుడు సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను. ఆత్మ విషయమున నీతిపరుడని తీర్పు నొందెను. దేవదూతలకు కనబడెను. రక్షకుడని జనములలో ప్రకటింపబడెను. లోకమందు నమ్మబడెను. ఆరోహణుడై తేజోమయుడయ్యెను" అని పరిశుద్ధాత్ముడు 1 తిమోతి 3:16లో లిఖించెను. "ఆయన శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను; తండ్రి వలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి". "ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు; తండ్రి రొమ్ముననున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలుపరచెను" అని భక్తుడైన యోహాను వ్రాసెను (యోహాను 1:14,18).

దేవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించు చున్నది. "అంధకారములో నుండి వెలుగు ప్రకాశించును గాక అని పలికిన దేవుడే తన మహిమను గూర్చిన జ్ఞానము యేసుక్రీస్తునందు వెల్లడిపరచుటకు మా హృదయములలో ప్రకాశించెను. గనుక మేము మమ్మును గూర్చి ప్రకటించు కొనుటలేదు గాని, క్రీస్తు యేసును గూర్చి ఆయన ప్రభువనియు, మమ్మును గూర్చి యేసు నిమిత్తము మేము మీ పరిచారకులమనియు ప్రకటించు చున్నాము" అని అపొ.పౌలు చెప్పుచున్నాడు (2 కొరింథీ 4:6).

మనము క్రీస్తును చూచునప్పుడు ఆయనలో ఏమి కనుగొనుచున్నాము? ఆయనను చూచిన అపొస్తలులు ఆయనలో ఏమి కనుగొనిరి? వారాయన ఎత్తు, ఆకారము, శరీరఛాయ, తలవెంట్రుకల యొక్కయు కండ్ల యొక్కయు రంగు మొదలైన వాటిని చూచిరి. అయితే ఈ భౌతిక లక్షణములను బట్టి అపొస్తలులలో ఎవడును ఆయన యొద్దకు వచ్చి యుండలేదు. వారిలో ఏ ఒక్కడును యేసు యొక్క శరీరాకారమును మనకు ఎన్నడు వర్ణించి యుండ లేదు. ఆయన భౌతిక ఆకారమును గూర్చి వ్రాయుటకు పరిశుద్ధాత్ముడు వారిలో ఎవరిని ప్రేరేపించలేదు. ఎందువలన? దేవుడు భౌతిక ఆకారమునకు ఏమియు

ప్రాముఖ్యతనిచ్చుట లేనందువలన. అందుకే కాబోలు కెమేరాలు కనిపెట్టబడక ముందే యేసుక్రీస్తును ఆయన ఈ లోకమునకు పంపించెను. మనము జ్ఞాపకముంచుకొన వలసినది ఆయన ఆత్మీయ స్వరూపమును గాని భౌతిక ఆకారమును కాదు.

## ఆత్మయైన దేవుడు

నిజానికి ఇప్పుడు మనము క్రీస్తును గూర్చి యెరిగినది యేమిటి? ఆయన ఆత్మీయ స్వరూపము. ఇప్పుడు మనమాయన ఆత్మీయ స్వరూపమును చూచినప్పుడు దేవుని చూతుము. అందుకే "నన్ను చూచినవాడు తండ్రిని చూచి యున్నాడు.. తండ్రియందు నేనును, నాయందు తండ్రియు ఉన్నాము" అని యేసు బోధించెను (యోహాను 14:9,10). అందువలన యేసు క్రీస్తును మనము చూచిన యెడల అదృశ్యుడైన తండ్రిని మనము చూడగలము.

నేనును, తండ్రియు ఏకమై యున్నామనుటలో, నేను దేవుడనై యున్నాను అని యేసు బోధించెను. అట్లు బోధించుటయే కాదు. ఆయన దేవునివలె జీవించెను. మనుష్యుల జీవితములలో పాపమును ఆయన ఖండించెను. మనుష్యులు మారుమనస్సు పొందవలెనని బోధించెను. అయినను ఆయన పలికిన మాటను బట్టిగాని, చేసిన క్రియను బట్టిగాని దేనిని గూర్చియు ఆయన పశ్చాత్తాపపడలేదు; సరిగదా, "నాలో పాపమున్నదని మీలో ఎవడు స్థాపించును?" అని ఆయన సవాలు చేసెను (యోహాను 8:46).

యేసు పరిశుద్ధుడు. మనము ఆయన సన్నిధిచేరవలెనంటే మనలనుండి పరిశుద్ధతను కోరుచున్నాడు. "నేను పరిశుద్ధుడను గనుక మీరును పరిశుద్ధులై యుండుడి" (1 పేతురు 1:16). "పరిశుద్ధత లేకుండ ఎవడును ప్రభువును చూడడు" (హెబ్రీ 12:14) అని ఆయన చెప్పుచున్నాడు.

యేసుక్రీస్తు ద్వారా ఆ పరిశుద్ధతను మనము పొందగలము. తండ్రియైన దేవుని యొద్దకు మనలను చేర్చుటకే ఆయన ఈలోకమునకు వచ్చెను. క్రీస్తు దేవుని కుమారుడని నమ్ముకొనండి, మీ పాపముల విషయమై మారుమనస్సు నొందండి, క్రీస్తు ప్రభువని నోటితో ఒప్పుకొని నీటిలో ముంచడము బొంది పరిశుద్ధులు అవ్వండి.

క్రీస్తులోనికి బాప్తిస్మము పొందవలెనని కోరుచున్న యెడల మీకు సమీపముగా యున్న క్రీస్తు సంఘమును దర్శించండి.

"క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" (రోమా 16:16).

# ఆ తొమ్మండుగురు ఎక్కడ?

## (Where are the Nine ?)

"యేసు ప్రభువు ఒక గ్రామములోనికి వెళ్లుచుండగా పదిమంది కుష్ఠరోగులు ఆయనకు ఎదురుగా వచ్చి దూరమున నిలిచి యేసుప్రభువా, మమ్ము కరుణించుమని కేకలు వేసిరి. ఆయన వారిని చూచి - మీరు వెళ్లి యాజకులకు కనుపరచుకొనుడని వారితో చెప్పెను. వారు వెళ్లుచుండగా శుద్ధులైరి. వారిలో ఒకడు తనకు స్వస్థత కలుగుట చూచి గొప్ప శబ్దముతో దేవుని మహిమ పరచుచు, తిరిగివచ్చి ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, ఆయన పాదముల యొద్ద సాగిలపడెను; వాడు సమరయుడు. అందుకు యేసు - పదిమంది శుద్ధులైరి కారా; ఆ తొమ్మండుగురు ఎక్కడ ? ఈ అన్యుడు

తప్ప దేవుని మహిమపరచుటకు తిరిగి వచ్చిన వాడెవడును అగపడలేదా అని చెప్పి - నీవు లేచి పొమ్ము; నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెనని వానితో చెప్పెను" (లూకా 17:12-19).

ఆ రోజులలో శుద్ధుడైన కుష్ఠురోగి సమాజములో తిరిగి ప్రవేశించుటకు గాను యాజకునికి కనబరచుకోవాలి (లేవీ.కా. 14:1-32). అందువలననే యేసు ఆ కుష్ఠరోగులను యాజకులకు కనబరచుకొనుడని చెప్పెను. ఆ పదిమంది కుష్ఠరోగులు స్వస్థపరచబడినను, వారిలో ఒక్కడు మాత్రమే కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచు యేసునొద్దకు తిరిగి వచ్చాడు. అతడు సమరయుడు అంటే యూదుడు కాని అన్యజనుడు. సాధారణంగా కృతజ్ఞత భావము కలిగియుండని జనములో నుండి వచ్చినవాడు. ఒక్కోసారి ఎవరిని మనం తక్కువగా అంచనా వేస్తామో వారే ఎక్కువ చేస్తారు. ఎవరినుండి ఎక్కువ అపేక్షిస్తామో వారే చతికిలబడతారు. ఆ ఒక్కడే తిరిగివస్తే యేసు "పదిమంది శుద్ధులైరికారా; ఆ తొమ్మండుగురు ఎక్కడ?" అని అడిగారు.(లూకా 17:17). నేడు కూడా ఆ ప్రశ్న సరియైనదే.

## కృతఘ్నత (ingratitude) ఒక ఘోర పాపము

దేవుని మరచిన ప్రజలను కృతఘ్నత వర్ణిస్తొంది: "వారు దేవునినెరిగియు ఆయనను దేవునిగా మహిమపరచలేదు; కృతజ్ఞతా స్తుతులు చెల్లింపను లేదు గాని తమ వాదముల యందు వ్యర్థులైరి" (రోమా 1:21).

అంత్యదినములలో తిరుగుబాటు చేయు ప్రజలన్ను కృతఘ్నత వర్ణిస్తొంది: "అంత్య దినములలో అపాయకరమైన కాలములు వచ్చునని తెలిసికొనుము. ఏలాగనగా మనుష్యులు స్వార్థప్రియులు, ధనాపేక్షులు, బింకములాడువారు, అహంకారులు, దూషకులు, తలిదండ్రులకవిధేయులు, కృతజ్ఞత లేనివారు, అపవిత్రులు, అనురాగరహితులు అతి ద్వేషులు, అపవాదకులు అజితేంద్రియులు

క్రూరులు సజ్జనద్వేషులు, ద్రోహులు, మూర్ఖులు గర్వాంధులు, దేవుని కంటే సుఖానుభవమును ఎక్కువగా ప్రేమించువారు" (2 తిమో 3:1-4).

కృతజ్ఞతలేని ఇట్టి స్వభావమును గూర్చి దేవుడు మనలను హెచ్చరించారు. "ఆయన మీ కొరకు ఎన్ని గొప్ప కార్యములు చేసెనో అది మీరు తలంచుకోవాలని" ఆయన కోరుచున్నారు (1 సమూ 12:24). కృతజ్ఞత కలిగియుండడం మనవిధి. కృతజ్ఞత లేకపోవడం మన యొక్క ఘోరబలహీనత, గొప్పపొరబాటు. అది లేకపోతే ఆదర్శ ప్రవర్తనకవుసరమైన లక్షణం లేకపోయినట్లే.

## మానవుని యెడల మానవునికి కృతజ్ఞత లేకపోవుట

మానవులకు మానవులకు మధ్య కృతజ్ఞత లేక ప్రవర్తించిన సందర్భాలు బైబిలులో పెక్కు కలవు.

1. యాకోబు చేసిన దీర్ఘకాల పరిచర్యకు లాబాను కృతజ్ఞత యేమీ చూపలేదు. ఈ సంగతిని యాకోబు ఎరిగినవాడై లాబాను కుమార్తెలైన లేయా, రాహేలులతో ఇట్లన్నాడు: "మీ తండ్రికి నా యావచ్ఛక్తితో కొలువు చేసితినని మీకు తెలిసేయున్నది. మీ తండ్రి నన్ను మోసపుచ్చి పదిమార్లు నా జీతము మార్చెను" (ఆది.కా. 31:6-7).

2. ఫరో సేవకుడగు పానదాయకుల అధిపతి యెడల యోసేపు దయగలిగి ప్రవర్తించి అతని కలకు సరియైన భావము తెలియజెప్పినను, ఈ కృతజ్ఞత హీనుడు రాజు తన ఉద్యోగమును తిరిగి తనకిచ్చినప్పుడు "అతడు యోసేపును జ్ఞాపకము చేసికొనక అతని మరచిపోయెను" (ఆది.కా. 40:1-23).

3. ఇశ్రాయేలీయులను మోషే ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించెను. గాని కొద్ది దినములలోగానే, విడుదల పొందిన యూదులు మోషే మీద సణగిరి, రాళ్లు రువ్వి అతని చంపుటకు సయితము సిద్ధపడిరి (నిర్గ 17:1-4).

4. దావీదు సౌలు రాజును చంపకుండ విడిచిపెట్టెను (1 సమూ 24 అధ్యా). గాని కృతజ్ఞతలేని సౌలు దావీదును చంపుటకే సంకల్పించుకొనెను.

5. అబ్షాలోము తన తండ్రియైన దావీదు రాజుకు ఎంత కృతజ్ఞత కలిగి యుండెనంటే, ఆ దేశపు ప్రజల హృదయాలను రాజువైపుగాక తనవైపే త్రిప్పుకొనెను (2 సమూ 15:1-6). ఎంత కృతఘ్నత ! ఎంత స్వార్థము !

## దేవుని యెడల మానవునికి కృతజ్ఞత లేకపోవుట

1. ఈ విషయంలో ఇశ్రాయేలీయులే ఒక గొప్ప ఉదాహరణ. దేవుని ప్రజలుగా వారు ప్రత్యేకముగా దీవించబడిను, వారు దేవుని మరచిపోయారు. మోషే వారిని గూర్చి చెబుతు, "నిన్ను పుట్టించిన ఆశ్రయ దుర్గమును విసర్జించితివి, నిన్ను కనిన దేవుని మరచితివని" చెప్పెను (ద్వితీ 32:18).

2. సౌలుకు పేరు ప్రఖ్యాతులు లేనప్పుడు అతడు దేవునికి విధేయుడైన సేవకునిగా యుండెను గాని దేవుడతనికి పేరు ప్రఖ్యాతులననుగ్రహించేసరికి, తన ఆశీర్వాదమునకు కారకుడైన వానిని మరచాడు (1 సమూ 15:10-26). ధన సమృద్ధి తరచు కృతఘ్నతకు దారితీస్తాది. ధనహీనతను, నిరుపేద స్థితిని అనుభవించే వరకు వారికి కృతజ్ఞతా భావములు ఉత్పన్నము కావు. తమ పెరటిలో యున్న బావి ఎండిపోతేనే గాని దాని ప్రయోజనమును మనుష్యులు తెలిసికోలేరు.

## అయితే ఆ తొమ్మండుగురు ఎక్కడ ?

పై సందర్భములను బట్టి మనం ఈ ప్రశ్న వేసుకోక తప్పదు: ఆ తొమ్మండగురు ఎక్కడ?

అనుదినం శారీరకంగాను, ఆత్మీయంగాను వేలాది దీవెనలతో మనం దీవించబడుచున్నాము (ఎఫెసీ 1:3; యాకోబు 1:5,17). గాని తరచు మనకు అన్నం పెట్టిన వారినే మరచిపోతాము ! అనేకులు అన్నం తింటారుగాని, దాన్ని దయచేసిన దేవుని వైపు చూడనేచూడరు.

రోగము నుండి, వ్యాధి బాధలనుండి విడుదల పొందిన వారిలో ఎవడో ఒకడు ఆరాధనకు వచ్చి కృతజ్ఞత చెల్లించుచుండ వచ్చును, గాని మిగతా తొమ్మండుగురు ఎక్కడ?

అగ్ని ప్రమాదము నుండి, ఏక్సిడెంటు నుండి, యుద్ధము నుండి రక్షింపబడి సజీవుడుగా యున్నవాడెవడో ఒక్కడు ఆరాధనలో పాలుపొంది కృతజ్ఞత చెల్లించుచుండ వచ్చును గాని ఆ తొమ్మిదిమంది ఎక్కడ ? వారికి కృతజ్ఞత లేదు! అభినందనలేదు !!

మనం పనిచేసుకొను నిమిత్తం సోమవారం నుండి శనివారం వరకు దేవుడు మనకు ఆరు రోజులు మట్టుకు జీవాన్ని, తరుణాలను యిచ్చారు (అపొ.కా. 17:25; నిర్గ 20:9). గాని వారంలో మొదటి దినాన్ని యేమి చేసాము? ప్రభువు దినాన్ని ఎట్లు గడుపుచున్నాము? ప్రభువు దినాన్ని కృతజ్ఞతా భావముతో గడపాలని చెబుతు, చైనా దేశీయుడైన బోధకుడు ఒక ఉదాహరణ చెప్పాడు: ఒక మనుష్యుడు తన జేబులో ఏడు రూపాయ నాణెములతో బజారుకు వెళ్లాడు. అక్కడొక భిక్షగాని దుస్థితి చూచి వానికి ఆరు రూపాయలు దానం చేసేసాడు. గాని అతను వెళ్లుచుండగా వెనుకనుండి ఆ భిక్షగాడు వచ్చి ఆ ఏడో రూపాయిని. కూడ దొంగిలించేసాడు. వాడెంత హీనుడో ! అవునని నీవనుకొనేలోగా, నీవు కూడా అంతే హీనుడవని నిన్ను నీవే తీర్పు తీర్చుకొనుచున్నావు. కృపగల దేవుని చేతినుండి నీవు ఆరుదినములు పొందియున్నావు. దానితో

సంతృప్తిజెందక ఏడోదినాన్ని కూడా నీవు ఆయన నుండి దొంగిలించుచున్నావు గనుక ఆరాధన సమయంలో కానుక లెత్తుచుండగా, "ఆ తొమ్మిది మంది ఎక్కడ?" (1 కొరింథీ 16:1-2).

ఆత్మల రక్షణ కొరకై స్థానికసంఘము చేయు కృషిలో, "ఆ తొమ్మండుగురు ఎక్కడ?". ఇతరులను రక్షించడానికే మనము రక్షింపబడ్డాము. అపొ.పౌలు సువార్తను గూర్చి యితరులకు రుణపడియున్నానని తలంచాడు. "గ్రీసు దేశస్తులకును, గ్రీసు దేశస్థులుకాని వారికిని జ్ఞానులకును మూఢులకును నేను ఋణస్థుడను; కాగా నావలననైనంత మట్టుకు రోమాలోని మీకును సువార్త ప్రకటించుటకు సిద్ధముగా ఉన్నాను. సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను" అని అతడు చెప్పాడు (రోమా 1:14-15).

## కృతజ్ఞత కలిగి యుండుడి

"మరియు కృతజ్ఞులైయుండుడి" యనునది దేవుని ఆజ్ఞ (కొలస్స 3:15). "ప్రతి విషయమునందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి" (1 థెస్స 5:18). "ప్రార్థన యందు నిలుకడగా యుండి కృతజ్ఞత గలవారై దాని యందు మెలకువగా ఉండుడి" (కొలస్స 4:2).

మనదైనందిన జీవితంలో దేవునికి, తోటి మానవులకు కృతజ్ఞత కలిగి యుండే సంగతులనేకములున్నాయి. తినడానికి తిండి, కట్టుకొనడానికి బట్ట, ఉండడానికి వసతి, చేయడానికి పని, మంచి భార్య / భర్త, పిల్లలు, మిత్రులు, సంఘము వగయిరాలన్నిటి కొరకు దేవునికి కృతజ్ఞత కలిగి యుందము.

"కాగా దేవునిచేత ఏర్పరచబడిన వారును, పరిశుద్ధులును ప్రియులునైన వారికి తగినట్లు మీరు జాలిగల మనస్సును, దయాళుత్వమును, వినయమును

సాత్వికమును దీర్ఘశాంతమును ధరించుకొనుడి" (కొలస్స 3:12). కృతజ్ఞత కలిగి యుండుడి. ఆ తొమ్మండుగురి వలె యుండుకుడి. స్వస్థత పొంధి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుటకు యేసునొద్దకు తిరిగి వచ్చిన ఆ సమరయుని అనుకరించుడి.

-- లీరోయ్ బ్రౌన్లో.

❦ ❦ ❦ ❦ ❦

# సబ్బాతును ఎవరు మార్చిరి ?

## (Who Changed the Sabbath ?)

గత సంచికలో శనివారమే సబ్బాతు దినమనియు దానిని దేవుడు ఇశ్రాయేలీయులకు తప్ప మరెవరికిని ఇయ్యలేదనియు తెలసికొన్నాము. ఈనాడు సబ్బాతు నిలిచియున్నదని బోధించువారే సబ్బాతును ఆచరించుట లేదనికూడ తెలిసికొన్నాము.

### క్రొత్త నిబంధనకైన ప్రవచనములు

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 8:8-13 వరకు మనము చూచిన యెడల మోషే ధర్మశాస్త్రమును, దానియందున్న ఆజ్ఞలును త్రోసివేయబడునని ముందుగనే యెహోవా దేవుడు ప్రవచించెను. "ప్రభువు ఇట్లనెను. ఇదిగో యొక కాలము వచ్చుచున్నది. అప్పటిలో ఇశ్రాయేలువారితోను యూదా ఇంటివారితోను నేను

క్రొత్తనిబంధన చేయుదును. అది నేను ఐగుప్తు దేశములో నుండి వీరి పితరులను వెలుపలికి రప్పించుటకై వారిని చెయ్యి పట్టుకొనిన దినమున వారితో నేను చేసిన నిబంధన వంటిది కాదు". యిర్మియా 31:31-33లో యున్న ప్రవచనమును అపొ.పౌలు ఇక్కడ ఎత్తి చూపించి ప్రభువు ఒక క్రొత్తనిబంధనను చేయుదునని చెప్పిన మాటను మనకు జ్ఞాప్తి తెచ్చుచున్నాడు. హెబ్రీ 8:13లో "ఆయన క్రొత్త నిబంధన అని చెప్పుటచేత మొదటిది పాతదిగా చేసియున్నాడు. ఏది పాతగిలి ఉడిగిపోవునో అది అదృశ్యమగుటకు సిద్ధముగా ఉన్నది" యని పౌలు వ్రాసెను.

ఇప్పుడు పాతనిబంధనకు బదులు క్రొత్తనిబంధన ఇయ్యబడి యున్నది. సబ్బాతు దినమగు శనివారమునకు బదులు ప్రభువు దినమగు ఆదివారము అనగా వారములో మొదటి దినము ఆరాధన దినముగా ఇయ్యబడి యున్నది. యేసుక్రీస్తు యొక్క మరణమువలన పది ఆజ్ఞలతో కూడిన పాతనిబంధన అమలులో లేకుండ కొట్టివేయబడినది. "కొట్టివేయబడు మహిమయొక్క అంతమును ఇశ్రాయేలీయులు తేరిచూడకుండునట్లు మోషే తన ముఖము మీద ముసుగు వేసుకొనెను ..... మరియు వారి మనస్సులు కఠినములాయెను గనుక నేటి వరకును పాతనిబంధన చదువబడునప్పుడు అది క్రీస్తునందు కొట్టివేయబడెనని వారికి తేటపరచబడక, ఆ ముసుగే నిలిచియున్నది" యని 2 కొరింథీ 3:12-14లో వ్రాయబడి యున్నది. మరల "దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను ఉండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దానిమీద చేవ్రాతను తుడిచివేసి మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసెను" అని కొలస్స 2:14లో వ్రాయబడి యున్నది.

పాతనిబంధన కాలములోనే యెషయా 1:13 ప్రకారము సబ్బాతు దినము దేవునికి అసహ్యము పుట్టించెను. అందువలన "దాని ఉత్సవకాలములను, పండుగలను, అమావాస్యలను, విశ్రాంతి దినములను, నియామక కాలములను

మార్పింతును" అని హోషేయ 2:11లో ప్రభువు పలికెను. యేసుక్రీస్తు పునరుత్థానుడై పరలోకమునకు వెళ్లి దేవుని ప్రధానయాజకుడాయెను. యాజకుడు మార్చబడినందున యాజకధర్మము సహామార్చబడెను (హెబ్రీ 7:12). యేసుక్రీస్తు సబ్బాతు దినమునకు ప్రభువై యున్నందున ఆయన పాతచట్టమును మార్చ గలిగెను (మార్కు 2:23-28). ఆయన దానిని తీసివేసెను. మనమిక మోషే ధర్మశాస్త్ర మందుగాక క్రీస్తు ద్వారా కలిగిన కృపయందున్నాము (యోహాను 1:17).

యేసుగాని, అపొస్తలులుగాని సబ్బాతు నాచరించవలెనని సంఘమును హెచ్చరించలేదు. పాతనిబంధనలోని పది ఆజ్ఞలలో విశ్రాంతి దినమును గూర్చిన ఆజ్ఞ తప్ప మిగిలిన తొమ్మిది ఆజ్ఞల సూత్రములు క్రొత్తనిబంధనలో ఇమడ్చబడి యున్నవి. యేసుక్రీస్తును, ఆయన అపొస్తలులును వీటిని బోధించిరి గనుక అవి క్రొత్తనిబంధనలో ఒక భాగమైయున్నవి. ప్రజలను క్రీస్తునొద్దకు తెచ్చుటలో పాతనిబంధన యొక్క ప్రయోజనము నెరవేర్చబడెను. క్రీస్తువెల్లడి యాయెను గనుక ఇకను ధర్మశాస్త్రము యొక్క ప్రయోజనము లేదు (గలతీ 3:16-29).

## ఆదిమ క్రైస్తవుల ఉదాహరణ

ఆదిమ క్రైస్తవులు వారములో ఆఖరిదినమున కాక మొదటి దినమందు దేవుని ఆరాధించుటకు కూడుకొనుచుండిరి. "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు (అంటే ఆరాధనకు) కూడినప్పుడు పౌలు మరునాడు వెళ్లనైయుండి, వారితో ప్రసంగించుచు అర్ధరాత్రివరకు విస్తరించి మాటలాడుచుండెను" అని అపొ.కా. 20:7లో వ్రాయబడి యున్నది. ఆదిమ క్రైస్తవులు దేవుని ఆరాధించుటకు కూడి వచ్చినప్పుడు చందా నిచ్చిరి. అది ఆదివార దినము అని 1 కొరింథీ 16:1,2లో వ్రాయబడి యున్నది. యేసుప్రభువు ఆదివారమున మృతులలో నుండి లేచెను (మార్కు 16:1-6). క్రీస్తు సంఘము పెంతెకోస్తు దినమున స్థాపించ

బడెను. అది ఆదివారము (అపొ.కా. 2). వారములో మొదటి దినమే ప్రభువు దినము. దానిని సబ్బాతు అని మనము పిలువరాదు (ప్రకటన 1:10).

## ఆదివారము యొక్క ప్రాముఖ్యత

యేసుప్రభువు ఆదివారమున మృతులలో నుండి పునరుత్థానుడైనందున ఆ దినమునకు గొప్ప ప్రాముఖ్యత కలిగియున్నది. అది దేవునిచే నియమింప బడిన దినము. యేసు మరణమును జయించి విజేయుడై లేచిన దినము అది. ఆయన సమాధి నుండి లేచిన తరువాత ఆదివారమున తన శిష్యులకు తన్నుతాను కనబరుచుకొనెను (యోహాను 20:1,19,26). ఆయన పరమునకు ఆరోహణుడైన తరువాత తన శిష్యులను సర్వసత్యములోనికి నడిపించుటకు పరిశుద్ధాత్మని పంపిన దినమది. అది ఆదివారము.

క్రైస్తవులు ఆచరించు నిమిత్తము క్రీస్తు ప్రభురాత్రి భోజనమును నెలకొల్పెను. ప్రభురాత్రి భోజనము చేయునపుడెల్ల వారు ఆయన వచ్చు పర్యంతము ఆయన మరణమును ప్రచురించుదురు. దానిని చేయుటకు ప్రభువు దినమైన ఆదివారముకంటె మిన్నయైన దినము వేరొకటి యేమున్నది?

ఆదివారమును ప్రభువు నారాధించు దినముగా మార్చుటలో క్రైస్తవుల ఆత్మీయ పెరుగుదల, క్షేమాభివృద్ధి ఇమిడి యున్నవి. ఒక సందర్భములో యేసు "విశ్రాంతి దినము మనుష్యులకొరకే గాని మనుష్యులు విశ్రాంతి దినము కొరకు నియమింపబడలేదు" అని చెప్పెను (మార్కు 2:27). దీనిని బట్టి సబ్బాతు అమలులో యున్నంత కాలము అది మానవుల క్షేమము నిమిత్తము ఇయ్యబడెనని మనకు అర్థమగుచున్నది. ఆ దినమునుబట్టి మానవులు అత్యున్నత అభ్యుదయమును సాధించవలసినది. ఇశ్రాయేలీయులు ఐగుప్తు బానిసత్వము నుండి పొందిన

విడుదలను జ్ఞాపకము చేసికొనుచు విశ్రాంతి దినము నెట్లు ఆచారించేవారో అట్లే నేడు ప్రపంచమందంతటా యున్న నిజక్రైస్తవులు పాపము నుండి క్రీస్తుద్వారా తమకు కలిగిన విమోచనను ప్రతి ఆదివారమున జ్ఞాపకము చేసికొందురు. అందువలననే "కొందరు మానుకొను చున్నట్టుగా సమాజముగా కూడుట మానక ఒకనినొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా అలాగుచేయుచు, ప్రేమ చూపుటకును, సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని" అపో.పౌలు పరిశుద్ధాత్ముని ప్రేరేపణతో క్రైస్తవులను హెచ్చరించుచున్నాడు (హెబ్రీ 10:24,25).

## మానవులు మార్చలేదు

ఆరాధన దినమును శనివారము నుండి ఆదివారమునకు మార్చిన దెవరు? దానిని ఏ మానవుడు మార్చలేదు. కేథలిక్కు సంఘముగాని, మరే సంఘముగాని దానిని మార్చలేదు. దేవుడే దానిని మార్చెను. యేసుక్రీస్తు చనిపోయి సమాధి నుండి తిరిగి లేచిన తరువాత క్రైస్తవులకు ప్రత్యేక దినముగా ఆదివారమును దేవుడు ఆరాధన దినముగా నియమించెను. మొదటి క్రైస్తవులు యూదా మతములో నుండి క్రైస్తవులుగా మారినవారు గనుక సబ్బాతును గూర్చి ఏమైనా బాధ ఉంటే వారికి ఉండవలసినది. గాని వారిలో ఏ ఒక్కడు అపొస్తలుల బోధను ప్రశ్నించినవారు లేడు. దేవుని చిత్తమునకు నిజక్రైస్తవులెవరు ఎదురు తిరుగరు కూడ.

ఇప్పుడు అమలులో యున్నది క్రీస్తు చట్టము. మనము దేవుని ఆరాధించ వలసిన దినము శనివారము కాదుగాని ఆదివారము. నీవు యూదుడవైనను అన్యుడవైనను సరే సబ్బాతుతో నీకిప్పుడు సంబంధము లేదు. గాని క్రీస్తుతో నీవు సంబంధమును, సమాధానమును కలిగి యుండవలెనంటే యేసే దేవుని

కుమారుడని నమ్ముకొనుము. పాపముల విషయమై మారుమనస్సు నొందుము. పాపక్షమాపణ నిమిత్తము నీటిలో క్రీస్తునామమును బట్టి ముంచడము బొందుము. ప్రతి దినము, ప్రతి ఆదివారము క్రీస్తు సంఘముతో కూడి దేవుని సేవింపుము. అప్పుడు సకలానందము నీదగును !!

-- జాషువా గూటం.

# మరి యేనామము లేదు
## (No other Name)

పేతురు తనను బంధించిన వారితో ఇట్లు చెప్పాడు: "మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామమునే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అపొ.కా. 4:12).

యేసుక్రీస్తు ఒక్కరే దేవుని అద్వితీయ కుమారుడు (యోహాను 3:16). మిగతా ప్రజలందరు దేవునిచే సృజింపబడిన ఆదాము హవ్వల నుండి ఉద్భవించినవారే, అయితే యేసు సృజింపబడిన వ్యక్తికాదు (యోహాను 1:1-3). యేసు తప్ప ఏ మతగురువు నేరుగా దేవుని నుండి ఉద్భవించిన వాడు కాదు.

భూమి మీద నివసించిన వారందరిలో క్రీస్తు ఒక్కడే పాపము లేనివాడు.

మిగతా మనందరము పాపము చేసినవారమే (రోమా 3:23). యేసు మనవలెనే శోధింపబడినను, పాపము లేనివాడుగా నుండెను (హెబ్రీ 4:15). మానవవ చరిత్రలో యేసుతప్ప పాపము లేని వాడెవడును లేడు.

క్రీస్తు ఒక్కడే మన పాపములకు ప్రాయశ్చిత్త బలి, ఆయన మన పాపములకు ప్రాయశ్చిత్తముగా మరణించెను (రోమా 6:23; 5:6-8; 1యోహా 3:16; 2:12). ఆయన సిలువ మరణము నొందునంతగా విధేయత చూపినందున అన్ని నామములకంటే పై నామమును దేవుడాయన కనుగ్రహించెను (ఫిలిప్పీ 2:9). మరియే మతనాయకుడు తన ప్రాణమును మానవుల పాపప్రాయశ్చిత్తముగా అర్పించలేదు.

యేసుక్రీస్తు ఒక్కడే మరణాన్ని జయించిన జయశాలి ! చనిపోయిన యితరులను ఆయన రక్షించెను. తరువాత భూమిమీద ఆయన పని ముగిసిన తరువాత యితరుల వలన ఆయన చంపబడుటకు అనుమతించెను. సమాధి చేయబడెను, గాని దేవుని శక్తివలన మూడవ దినమున సజీవుడుగా తిరిగి లేచెను (మత్త 17:23; యోహా 10:18; 11:25). మరియే మతస్థాపకుడు యేసువలె మరణాన్ని జయించలేదు !

యేసుక్రీస్తు ఒక్కడు మాత్రమే ఆయన సంఘానికి శిరస్సు ! దాన్ని నిర్మించిన వాడు ఆయనే (మత్త 16:18). సంఘము ఆయన ఆత్మీయ శరీరము (కొలస్స 1:18). ఆయన సంఘముగా నిజంగా యుండాలంటే ఆయన మాటలకు లోబడాలి (2 యోహాను :9). మరియే మతనాయకుడు ఆయన సంఘానికి శిరస్సుగా యుండనేరడు !

(IGT).

# సువార్త పిలుపు
## (The Gospel Call)

అనేకులు మావద్దకు వచ్చి దేవుడు వారిని సువార్తసేవకు పిలిచినట్లు చెబుతు యుంటారు. దేవుడే తన స్వంత స్వరముతో వారిని పిలిచినట్లు కొందరు చెబుతారు., మరికొందరయితే తాము నిద్రించుచుండగా క్రీస్తు కలలో కన్పడి వారిని పిలిచినట్లు చెబుతారు. ఇంకా కొందరయితే తాము వర్ణింపలేని గొప్ప అనుభవమును వారికిచ్చుట ద్వారా ప్రభువు వారిని రక్షణ లోనికి పిలిచినట్లు చెబుతారు. వీరందరు కూడ ప్రభువు ఆయా విధములుగ వారిని పిలిచి రక్షించినట్లు భావించుదురు. అయితే దీని విషయమై బైబిలు ఏమి బోధించుచున్నది ? మీకొక చిన్న హెచ్చరిక ఇయ్యవలెనని కోరుచున్నాను. ప్రభువు యొక్క స్వరమును వినుచున్నట్లు ఆయనను చూచు చున్నట్లు చెప్పుకొను వారిని గూర్చి జాగ్రత్త కలిగియుండుడి.

## కుమారుని ద్వారా

ప్రభువు మనతో మాట్లాడుచున్నాడా ? అయితే ఎట్లు మాట్లాడుచున్నాడు? అనే విషయాన్ని దైవవేదము నుండి ఈ రోజు కొంత గమనించుదము. మనము హెబ్రీ 1:1,2ను చదివిన యెడల దీనికి జవాబు అక్కడ వ్రాయుబడియున్నది: "పూర్వకాలమందు నానా సమయములలోను నానావిధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు, ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకు వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను". దీనినిబట్టి దేవుడు తన కుమారుని ద్వారా మనతో ఈనాడు మాటలాడుచున్నట్లు గ్రహించుకొనగలము. అందుకే "ఈయన నా ప్రియకుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నాను. ఈయన మాట వినుడని" తండ్రియైన దేవుడు క్రీస్తును గూర్చి సాక్ష్యము పలికెను (మత్తయి 17:5).

# లేఖనముల ద్వారా

మనము యేసుక్రీస్తు మాటను వినవలెననిన, ఆయన మనతో ఎట్లు మాట్లాడుచున్నాడు? క్రీస్తు ప్రత్యక్షముగా ఈనాడు మనతో మాట్లాడుచున్నాడా? అనే ప్రశ్న మనకు రావచ్చును. దీనికి జవాబుగా మనము యోహాను 20:30,31 వచనములను చదవుకొందము: "మరియు అనేకమైన యితర సూచకక్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను. అవి యీ గ్రంథమందు వ్రాయబడి యుండ లేదు. గాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను". క్రీస్తును గూర్చి అవి ఎందుకువ్రాయబడెను? మనము ఆయనను నమ్మునట్లు అవి వ్రాయ బడెను. అవి ఎక్కడ వ్రాయబడెను? క్రొత్త నిబంధనలో వ్రాయబడెను గదా. గనుక మనము క్రొత్తనిబంధన గ్రంథమును చదివిన యెడల దేవుని చిత్తమును ఎరుగగలము.

మరల, "వినుటవలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" అని రోమా 10:17లో మనము చూడగలము. విశ్వాసము మరొక విధముగా కలుగునా? అట్లయితే లేఖనములు దానిని గూర్చి ఏమియు బోధించుటలేదు. మేము ఆ స్వరము విన్నాము, ఈ సంగతిని చూచాము అని చెప్పుకొనే వారు అనేకులున్నారు, నిజమే. గాని అట్టి దానిని గూర్చి బైబిలు ఏమియు బోధించుటలేదు. సరిగదా, దేవుని వాక్యమును వినుట ద్వారా గాని, చదువుట ద్వారా గాని, విశ్వాసము కలుగునని బైబిలు బోధించు చున్నది. మనకున్న బైబిలు ఒక్కటే, గనుక ఉన్న విశ్వాసము ఒక్కటే (ఎఫెసీ 4:5).

దేవుని వాక్యమును వినుట ద్వారా విశ్వాసము కలుగుచున్నందున, మనము వాక్యమును పఠించవలెనని, పరిశోధించవలెనని హెచ్చరింపబడి యున్నాము (2 తిమో 2:15; యోహాను 5:39). లేఖనములు పరిశుద్ధాత్మా వేశము వలన కలిగినవి గనుక అవి సర్వసంపూర్ణములు (2 తిమో 3:16,17).

సువార్త ప్రకటింపబడుటకు దేవుడు మానవులపై ఆధారపడి యున్నాడని

లేఖనములు బోధించుచున్నవి. అపొ.పౌలు ఇట్లనుచున్నాడు: "అంధకారములో నుండి వెలుగు ప్రకాశించునుగాక అని పలికిన దేవుడే తన మహిమను గూర్చిన

గనుక మేము మమ్మును గూర్చి ప్రకటించుకొనుట లేదు గాని, క్రీస్తు యేసును గూర్చి ఆయన ప్రభువనియు, మమ్మును గూర్చి యేసు నిమిత్తము మీ పరిచారకుల మనియు ప్రకటించుచున్నాము. అయినను ఆ బలాధిక్యము మామూలమైనది కాక దేవునిదై యుండునట్లు మంటి ఘటములలో ఈ ఐశ్వర్యము మాకు కలదు" (2 కొరింథీ 4:5-7). మంటి ఘటముల వంటి మానవులను సువార్త ప్రచారము నిమిత్తము దేవుడు ఏర్పరచు కొనినట్లు ఇక్కడ అపొ.పౌలు చెప్పుచున్నాడు. అపొస్తలులకార్యములు అను పుస్తకములో క్రైస్తవులుగా మార్పుజెందినవారి సందర్భము లనేకములు వ్రాయబడియున్నవి. వాటిలో ఏ ఒక్క సందర్భములోను కూడ మానవులు లేకుండ సువార్త బోధింప బడలేదు. రక్షణ పొందు విధానమును మానవులకు మానవులే బోధించిరి. ఎందువలన? మానవుల నుండి మానవులకు సువార్త బోధింపబడవలెనని ప్రభువు నిశ్చయించినందువలన. అందుకే లేఖనముల ద్వారా గాక మరింకొక విధముగా ప్రభువు ఈనాడు మానవులతో మాటలాడుట లేదని మనమెరుగుదుము.

## సువార్త ప్రకటన ద్వారా

లోకమంతటికి సువార్తను బోధించే బాధ్యతను మన ప్రభువు దేవదూతలకు ఇయ్యలేదుగాని మానవులకే యిచ్చెను. "మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడునని" ఆయన తన శిష్యుల కాజ్ఞాపించెను (మార్కు 16:15,16). అందుకే "ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయువాడెవడో వాడు రక్షింపబడును. వారు విశ్వసింపని వానికి ఎట్లు ప్రార్థన చేయుదురు? వినని వానిని ఎట్లు విశ్వసించుదురు? ప్రకటించు వాడు లేకుండ వారెట్లు విందురు? ప్రకటించువారు పంపబడని యెడల ఎట్లు

ప్రకటించుదురు? ఇందు విషయమై ఉత్తమమైన వాటిని గూర్చిన సువార్త ప్రకటించువారి పాదములెంతో సుందరమైనవి అని వ్రాయబడియున్నది" (రోమా 10:13-15). ప్రజలు విని విశ్వసించునట్లు సువార్త బోధింపబడవలెను. సువార్త బోధింపబడవలెనన్న సువార్తికులు అవుసరము. అందుకే, 'వాక్యమును ప్రకటించుము, సమయమందును, అసమయమందును ప్రయాసపడుము; సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము, గద్దించుము, బుద్ధి చెప్పుము" అని అపొ.పౌలు తిమోతిని హెచ్చరించెను (2 తిమో 4:2).

ప్రభువు ఈనాడు మనలను ఎట్లు పిలుచుచున్నాడు? ప్రకటింపబడుచున్న తన సువార్త ద్వారా పిలుచుచున్నాడు. థెస్సలోనీకయలో యున్న క్రైస్తవులకు పౌలు ఇట్లు వ్రాసాడు: "మీ రీలాగున రక్షింపబడి మన ప్రభువైన క్రీస్తుయొక్క మహిమను పొందవలెనని, ఆయన మా సువార్త వలన మిమ్మును పిలిచెను" (2 థెస్స 2:14). పౌలు వారికి సువార్తను బోధించెను. వారు దానిని విని విశ్వసించి, దానికి లోబడిరి. గనుక క్రీస్తునొద్దకు వారట్లు సువార్త ద్వారా పిలువబడిరి. థెస్సలోనీకయలోని క్రైస్తవులవలెనే నేడు క్రైస్తవులమై యున్న మనలను కూడ ఆయన పిలిచెను. ఆ పిలుపును యేసు క్రీస్తు అద్భుత స్వరముతో పిలువలేదు గాని, మాకు సువార్త బోధింపబడెను. మేము దానిని విని విశ్వసించి, దానికి లోబడితిమి. ప్రభువు మమ్మును రక్షించి తన సంఘముతో మమ్మును చేర్చెను. మేము సువార్తను ఇతరులకు బోధించునప్పుడు అదే సంగతి మరల జరుగు చున్నది. ప్రభువు ఒకని ఒక విధముగాను, మరొకని ఇంకొక విధముగాను పిలుచుట లేదు. సరిగదా, ఆయన అందరినీ తన సువార్త ద్వారా ఒకేరీతిగా పిలుచుచున్నాడు.

అవును, దేవుడు మనతో మాటలాడుచున్నాడు. గాని ఆయన క్రీస్తుద్వారా మాట్లాడుచున్నాడు. క్రీస్తు తన వాక్యము ద్వారా ఈనాడు మనతో మాటలాడు చున్నాడు. క్రీస్తుకు విధేయులైన వారు ఇతరులకు సువార్తను బోధించే బాధ్యతను

కలిగియున్నారు. సువార్తను బోధించుట ద్వారా పాపములోబడి నశించి పోవుచున్న వారిని ప్రభువు పిలుచుచున్నాడు (మత్తయి 11:28-30).

సువార్త ద్వారా క్రీస్తు పిలుపును నీవు విన్నావా? ఆయనయందు విశ్వాస ముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము, క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుట ద్వారా సువార్తకు లోబడుము... అనేకులకు సువార్త పిలుపును అందించి ధన్యుడవు కమ్ము !!

-- (సత్యవాణి ప్రసంగమాలిక
నుండి సేకరణ).


**ADMISSION NOTIFICATION**

**LENORA COLLEGE OF ENGINEERING**

A Christian Minority Institution
(Approved by AICTE & Govt. of A.P)
**RAMPACHODAVARAM - 533 288. E.G. Dist.,**
**Phones : 08864-43013, 43600; 0883-435678**
**Cell : 9848040578, 9848274013.**

Invites applications for admission in NRI or in lieu of NRI students into B.Tech., 1st year for 2002-2003 in CS & IT, CSE & ECE branches for candidates with 1st class or 60% in optional subjects in Intermediate or its equivalent in a regular attempt or in the instant exam. Application may be furnished on plain paper enclosing a Xerox copy of pass certificate of qualifying exam or contact the above Phone numbers. Last date for receipt of applications : **JULY 25, 2002. The members of the Churches of Christ will be given preference.**

**B. JOHN RATNAM,** Director & Correspondent

# చదువరులకు విజ్ఞప్తి

సత్యవాక్కు మాసపత్రిక గత 22 సంవత్సరాల నుండి నిర్విఘ్నముగా దేవుని కృపవలన కొనసాగుచున్నది. 2002 ఆగష్టు నెలలో అది 23వ సంవత్సరములో ప్రవేశించును. ప్రస్తుతము అది 10,500 గృహాలను దర్శించుచున్నది. అయితే అది ఇప్పుడు గొప్ప ఆర్థిక సమస్యలను ఎదుర్కొనుచున్నది. కొందరు తలంచుచున్న రీతిగా ఈ పత్రికకు విదేశీ సహాయం యేమిలేదు. యిది ప్రభుత్వము వారిచే రిజిష్టర్ చేయబడిన మాసపత్రిక గనుక విదేశీధనం దీని ప్రచురణలో యేమీ వాడకూడదు, వాడుటకూడ జరుగదు. అది చట్టవిరుద్ధం. ఇంతకాలం అది కేవలం భారతీయుల సహాయసహకారాలతో కొనసాగుచున్నది. అయితే 2002 జూలై నెలాఖరులోగా 30/- రూపాయలు గాని అంతకు ఎక్కువగాని మీరు సత్యవాక్కుకు కానుక పంపకపోతే సత్యవాక్కు మీకు అందజేయలేము. గనుక దీనిని గమనించగోర్తాము. భవిష్యత్తులో సత్యవాక్కు ప్రతినెలా క్రమముగా పొందగోరుచున్నవారు మీ కానుకను జూలై ఆఖరులోగా దిగువ చిరునామాకు **M.O** చేయండి. **M.O** ఫారం మీద మీ అడ్రసు, సత్యవాక్కు లేబిల్ మీద యున్న మీ నంబరు తప్పక వ్రాయండి. మీ కానుకలు పంపవలసిన చిరునామా :-

**SATYA VAKKU**
7-9-35, SAMBAMURTHY STREET,
KAKINADA - 533 004
PH: 0884 - 363722

జూన్ 15వ తేదీ శనివారం పిఠాపురం మండలం క్రొత్తకందరాడలో క్రీస్తు సంఘ గ్రామీణ సువార్తికుల సదస్సు జరిగెను. ఉష్ణోగ్రత విపరీతముగా యున్నందున సువార్తికులు స్వల్పముగా హాజరైరి. దానిలో జాషువా గూటం గారు ప్రభురాత్రి భోజనము యొక్క ప్రాముఖ్యతను, క్రీస్తు సంఘ చరిత్రను సవిస్తరముగా వివరించిరి. స్థానికసంఘ సువార్తికులు యం. యేసుదాసు గారు క్రొత్త కందరాడలోను పరిసర గ్రామములలోను వారు చేయుచున్న పనిని గూర్చి వివరించిరి. సోదరులు కె. ప్రకాశరెడ్డి గారు వందన సమర్పణ చేసిరి. క్రొత్త కందరాడ సంఘము హాజరైన వారందరికీ మంచి భోజనమునేర్పాటు చేసిరి.

జూన్ 16వ తేదీ ఆదివారం కాజులూరు మండలం పాలమూరుపాడులో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును సోదరులు జాషువా గారు ప్రార్థన పూర్వకముగా రిబ్బను కత్తిరించి ప్రతిష్ట చేసిరి. తదుపరి వాక్యపరిచర్య చేసిరి. సోదరులు టి. ప్రసన్న విజయ కుమార్ గారు ప్రభురాత్రి భోజన కార్యక్రమము నిర్వహించిరి. స్థానిక సువార్తికులు దున్నా పద్మనాభం గారు ఆలయ నిర్మాణములో సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేసిరి. జగన్నాథగిరిలోను, పాలమూరుపాడులోను సోదరులు దున్నా పద్మనాభం గారును, ఆయన కుమారుడు జయప్రకాశ్ గారును క్రీస్తు కొరకు కష్టించి పనిచేయుచున్నారు, మంచి ఫలితములను సాధించుచున్నారు. పాలమూరుపాడులో ఆరాధన అనంతరం క్రీస్తులోనికి ఇద్దరు బాప్తిస్మము పొందిరి.

జూన్ 20వ తేదీ గురువారం ఆచంట మండలం ములపర్రు పల్లెలపేటలో నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆలయమును సోదరులు జాషువాగూటం గారు ప్రార్థన పూర్వకముగా దేవుని సేవకొరకు ప్రతిష్టచేసిరి. తదుపరి వాక్యపరిచర్య చేసిరి. ఆ సందర్భముగా సోదరులు యన్.మోజెస్ (కరుగోరుమిల్లి) జి. సూర్యప్రకాశరావు (పెదగరువు) గార్లు కూడ వాక్యపరిచర్య చేసిరి. సోదరులు కుసుమప్రసాద్ గారు తదితర్లు పాటలు నడిపించుటలోను, ప్రార్థన చేయుటలోను సహకరించిరి. పల్లీలపేటలో సోదరులు గంటి ధనరాజుగారు సువార్త చాటుచున్నారు. స్థానిక సంఘము హాజరైన వారందరికీ మంచి భోజనము నేర్పాటుచేసిరి. గంటి ధనరాజుగారు చేయుచున్న సేవ మరింత ఫలించునట్లు ప్రార్థించుదాం.

జూన్ 23వ తేదీ ఆదివారం ఉదయం చెన్నై నగరంలో కోటూరులో యున్న క్రీస్తు సంఘారాధనకు జాషువా గూటం గారు సతీసమేతముగా హాజరై అక్కడ వాక్యపరిచర్య చేసిరి. కోటూరులోను, చెన్నై మహానగరంలోను ఆంధ్రలో

పలుప్రాంతములలోను సోదరులు కె. మల్లిక్ గారు మంచి పనిచేయుచున్నారు. మరియు అనాథల పిల్లలు ఆశ్రయము, స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ కూడా సమర్థవంతముగా నడుపుచున్నారు.

జూన్ 25వ తేదీ మంగళవారం పిఠాపురం మండలం పవర గ్రామములో రాత్రివేళ జరిగిన సువార్త కూటములో జాషువా గూటం గారు సతీసమేతముగా హాజరై వాక్యపరిచర్య చేసిరి. అక్కడ బేసిక్ బైబిలు కోర్సు పూర్తిచేసిన 36 మందికి బైబిళ్లు, సర్టిఫికెట్లు బహూకరించిరి. పవర గ్రామములో జరిగిన కూటమునకు స్థానికులు భూషణం గారు, కిషోర్ కూమార్ గార్లు బహుగా సహకరించిరి.

**మీరు సత్యవాక్కు మాసపత్రికకు 30/- రూపాయల చందా పంపారా ? లేనియెడల ఆ పత్రిక మీకు ఇక రాదు. గనుక త్వరపడండి !!**

✿ ✿ ✿ ✿ ✿

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/2002

**From:**

**SATYA VAKKU**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**

**To**

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : JOSHUA GOOTAM.